కథ



రైలు కదిలింది....

అయినవాళ్లనంతా కనుమరుగయ్యారు. ప్లాట్‌ఫారమ్ మీది 'విజయవాడ జంక్షన్' బోర్డు కూడా వీడ్కోలు చెప్పింది.

ఏదో గుబులు మనసును మెలిపెడుతోంది.

ఒంటరిగా కాశీ ప్రయాణం ఎందుకు పెట్టుకున్నాడు తను. రెండు నెలలు ఆగితే మనమడి ఇంజనీరింగ్ పరీక్షలు పూర్తయ్యేవి. వాడు కూడా తోడువొచ్చేవాడు.

# జీవన లిపి

## అలపర్తి రామకృష్ణ

తనతో పాటు రావడానికి కొడుక్కు సెలవు దొరకలేదు.

చివరి మజిలీ మలుపులో వున్నాడు. ఎందుకు గుబులు? అందరిని వొదిలిపెట్టి వెళ్లిపోయే వయస్సొచ్చినా ఏరోజునైనా ఒంటరి ప్రయాణం తప్పదు కదా! జీవితం ఉలిపిరి కాగితం లాంటిది. ఈ కాలం కుర్రాళ్లకి 'ఉలిపిరి కాగితం' అనే పదం వుందని తెలుసా?

ఎదురు బెర్త్ మీద కూర్చున్న కుర్రాడి మీద దృష్టి మళ్లింది. అతని వైపు చూస్తుంటే ఆ కుర్రాడే పలకరించాడు.

''ఎక్కడిదాకా ప్రయాణం తాతగారూ?''

''వారణాసి''

''తోడు ఎవరన్నా వున్నారా?''

''నాకు నేనే తోడు''

ఎనభైయేళ్ల వయస్సులో ఒంటరిగా బయల్దేరారే! మీ ధైర్యానికి మెచ్చుకోవాలి. నిండా పాతికేళ్లు లేని నాకు వారణాసి దాకా అంటే బెరుగ్గా వుంది.

ఆ కుర్రాడు కాశీ వొస్తున్నాడు. కాలక్షేపం అవుతుంది. ఆ అబ్బాయి పేరు కార్తీక్. తండ్రి అస్థికలు గంగలో కలపడానికి వెళుతున్నాడు.

తన గురించి వివరాలు చెప్పాక. ''మీరు... అస్థికలు గంగలో కలపడానికేనా? ఎవరివి? మీ భార్య గారివా?'' అని అడిగాడు.

''మా ఆవిడ బ్రతికే వుందయ్యా. బాగా దగ్గరి చుట్టానివి.''

వివరాలు అతనికి చెప్పదలుచుకోలేదు.

వసుమతి ఎవరో? తనకు ఆమె ఏ విధంగా ఆత్మబంధువు అవుతుందో ఆ కుర్రాడికి ఎందుకు చెప్పాలి? శరీరం ఎడారిగా మారినా, గుండెను ఒయాసిస్సుగా మార్చింది వసుమతే! మెదడు పొరల టేప్ రికార్డర్‌లో జ్ఞాపకాల క్యాసెట్ 'ప్లే బటన్'

నొక్కినట్లు పాత జ్ఞాపకాలు కళ్ల ముందు కదలాడాయి.

వసుమతి తనకంటే నాలుగేళ్లు చిన్నది. పాత పొన్నూరులో వుండేవాళ్లం. పక్కపక్కనే ఇళ్లు. మగ పిల్లలతో తిరిగేవాడిని కాదు. బలహీనంగా పుల్లలా కనిపిస్తూ వుండడంతో ఏడిపిస్తూ వుండేవాళ్లు. ఆటలలో ఓడిపోయేవాడిని. ఎప్పుడూ నన్ను నడుం వొంచి వొంగమని చెప్పి మీదఎక్కి దూకేవాళ్లు. ఫర్లాంగు దూరం ఆగకుండా కుంటమనేవారు. ఏడ్చేసేవాడిని. అందుకనే మగపిల్లల జోలికి వెళ్లకుండా వసుమతి దగ్గర చేరేవాడిని. సాయంత్రం పూట భావన్నారాయణ స్వామి ఆలయం దగ్గర చేరేవాడిని. గుడిచుట్టూ ప్రదక్షణ చేస్తూ వుండే వాడిని.

''గుడి దగ్గర తిరుగుతున్నావ్... ప్రసాదం కోసమా..?'' నవ్వుతూ అనేది వసుమతి.

ఆ అమ్మాయి మాటలకు రోషం వొచ్చేది కాదు.

''దేవుడిని ఏం కోరుకుంటున్నావ్? మంచి పెళ్లాన్ని ఇవ్వమనా?''

వసుమతి ఏం మాట్లాడినా తనకు ముచ్చటగానే వుండేది. ముసిముసి నవ్వులు నవ్వుకునేవాడిని.

పద్దెనిమిదేళ్లు వొచ్చేసరికి బంగినపల్లి మామిడి కాయలా పచ్చిగా మిసమిసలాడుతూ వుండేది. చిత్రకారుడికే అంబరాన్ని తాకే ఆనందాన్ని ఇచ్చే ఆకృతి ఆమెది. కోల మొహం, చిన్ని ముక్కు, గడ్డం మీద చిన్న నొక్కు, కమలంలా వుండే కళ్లు, ఎంత సేపూ చూసినా మళ్లీ మళ్లీ చూడాలనిపించేది.

గలగలలాడే గాజుల మోత వినాలని, కలకల నవ్వుల జల్లులో తడిసి ముద్దవ్వాలని, ఆ అమ్మాయి పమిట ఎప్పుడు జారిపోతుందా? పొంగులు వారే వక్షోజాలను ఎప్పుడు చూస్తానా? అని తహతహలాడుతూ వుండేవాడిని. నా ఉనికి అంతా ఆమె నవ్వుల్లో, చూపుల్లో, మాటల్లో, ఆమె మనసులో మమేకమై పోతూ వుండేది.

ప్రేమ సామ్రాజ్యానికి నన్ను రారాజును చేసి తను యువరాణిలా కులికేది. ఆ ప్రేమ దేవత జీవితమంతా తోడువుంటుందని ఎన్నో కలలు కన్నాను. అనుకున్నవన్నీ జరగవ్. అలా జరిగితే బ్రతుకులో రుచి ఏముంటుంది?

మరొకరితో వసుమతి పెళ్లయింది.

రోదిస్తున్న మనస్సును ఆమె ఓదార్చింది. ప్రేమ కంటే బ్రతుకు విలువైనదని నచ్చచెప్పింది. ఆడుకున్న బొమ్మ విరగ్గొట్టుకొని ఏడుస్తున్న బాలుడిని సముదాయించినట్లుగా లాలించింది. తన చల్లని మాటలతో చందనపు జల్లు కురిపించి స్నేహితురాలిగా జీవితమంతా తోడు వుంటానని నాలో నమ్మకం కలిగించింది. బ్రతుకులోని వైవిధ్యాన్ని వివరించింది...

షీ ఈజ్ గైడ్, ఫిలాసఫర్ అండ్ ఫ్రెండ్ టూ మి....

నన్ను కూడా పెళ్లి చేసుకొమ్మని ప్రోత్సహించింది. సుశీలతో పెళ్లయ్యింది.

పెళ్లయ్యాక......

మా ఇంటి గుమ్మం దగ్గర కొత్త దంపతులిద్దరిని లోపలకి రానివ్వకుండా నిలబెట్టారు. ఒకరి పేరు మరొకరు చెప్పాలని పట్టుబడుతూ...పేర్లు చెప్పాకనే హారతి ఇచ్చి లోపలకి రానిస్తామని ఆడబడుచులు గొడవ చేశారు.

వో పావుగంట గడిచాక సుశీల నాపేరు చెప్పాలని అనుకున్నా. ''నువ్వు చెప్పకు చెల్లీ'' అంటూ సన్నాయి నొక్కు నొక్కింది వసుమతి సుశీల పక్కన చేరి.

ఎంతసేపు నిలబెడతారే... ఆ పిల్లకు కాళ్లునెప్పులు పుడతాయి. తెల్లవారుజామున లగ్నం. రాత్రంతా నిద్ర లేదు వాళ్లకు. పెళ్లి హడావుడి అదీ... లోపలకు రానివ్వవే!'' అందో పెద్ద ముత్తయిదువ.

''పేర్లు చెప్పాల్సిందే'' అందో అమ్మాయి.

''రాధాకృష్ణ''

తన పేరు మధురంగా ఉచ్ఛరించడంతో మురిసిపోయాడతను.

''సుశీల'' నవ్వుతూ అన్నాడు తను.

హారతి ఇచ్చి లోపలకు తీసుకెళ్లారు. లోపలికి వెళ్లేటప్పుడు వసుమతి పెద్దగా నవ్వడం, సుశీల కూడా వొస్తున్న నవ్వును ఆపుకోలేనంతగా పెద్దగా నవ్వడంతో అసలు విషయం అర్థమైంది. తన పేరు చెప్పింది సుశీల కాదు. పక్కనే వున్న వసుమతి.

సుశీలకు తనంటే పంచప్రాణాలు. వసుమతితో తనకు వున్న అమలిన బంధాన్ని అర్థం చేసుకుంది. ఇంటికి సంబంధించిన ప్రతి విషయంలో వసుమతి సలహా తీసుకోవలసిందే!


కార్తీక్ పలకరించడంతో ఆలోచనా స్రవంతికి అడ్డుకట్ట పడింది కొంతసేపు.


''కాశీ యాత్ర ఇంతకు ముందు ఎప్పుడైనా చేశారా తాతగారూ?'' అడిగేడు కార్తీక్.

ఎనభైలో పడ్డా మనస్సు 'యువకుడివే' అంటుంది. మనసుకు సీతాకోక రెక్కలు వున్నాయోమో! తనను తాతగారని సంబోధించాడు గాబట్టి ఆ కుర్రాడికి కాశీక్షేత్రం గురించి చెప్పాలి.

''గతంలో రెండుసార్లు వెళ్లాను బాబూ! కాశీ యాత్ర చేయకపోతే జీవితం వ్యర్థమే! రాజ్యాలు అంతరించినా, చక్రవర్తులు కాలగర్భంలో కలిసిపోయినా కాశీ ప్రఖ్యాతి తగ్గలేదు. గౌతమి బుద్ధుడు, ఆది శంకరుడు, తులసీదాసు, హిందూ విశ్వ విద్యాలయాన్ని నెలకొల్పిన మదనమోహన మాలవ్యా, విదేశీ యాత్రికుడు హుయాన్ సాంగ్ ఎందరో మహానుభావులు కాశీని దర్శించారు. కాశీలో మరణిస్తే జన్మరాహిత్యం సిద్ధిస్తుంది. ఒకవేళ కాశీలో నేను చనిపోయే పరిస్థితి ఏర్పడితే బ్రతికించే ప్రయత్నం మాత్రం చెయ్యకు బాబూ!'' అన్నాను నవ్వుతూ...

''నిండు నూరేళ్లు బ్రతకాలి తాతగారూ! మనం యాత్రలు చేస్తున్నామన్న మాటేగానీ నిజంగా ఎంజాయ్ చేయడం లేదండి! తాజ్‌మహల్, ఢిల్లీ, కన్యాకుమారి చూడాలని బయలుదేరుతాం. అక్కడకు చేరుకోగానే అక్కడ వసతి గురించి, తిరుగు ప్రయాణం గురించి ఆలోచిస్తూ వుంటాం. హడావుడిగా నాలుగు ఫోటోలు తీసుకొని ఇంటి దారి పడతాం!



ఆల్బమ్‌లో ఫోటో చూసి తృప్తిపడడం తప్పితే ఆయా ప్రాంతాల్లో వున్నంతసేపూ మనసు పెట్టి ఆ ప్రాంతాలను చూడం. ఫ్రెండ్స్‌కు మాత్రం గొప్పగా తాజ్‌మహల్ చూసాను అని చెబుతాం. ఈ రైలు ప్రయాణాన్ని ఎంత మంది ఎంజాయ్ చేస్తున్నారు? పేపరు చదువుతూనో, పనికిరాని రాజకీయాలు మాట్లాడుతూనో, జోగుతూనో వున్నారు. పేపరు, రాజకీయాలు, నిద్ర ఎప్పుడూ వుండేవే గదా?''

నా మనస్సులోని భావనలకు అతని భావన దగ్గరగా వుంది. అతనితో కలివిడిగా మాట్లాడడం మొదలుపెట్టా! కాశీ యాత్ర పూర్తయ్యేంత వరకు అతని తోడు సరదాగానే వుంటుంది.

మరుసటి రోజు కూడా రైల్లోనే...

రైలు కదలికతోపాటే ఆలోచనలు కదలాడుతున్నాయి.

వసుమతికి ఇద్దరు కొడుకులు. వాళ్లిద్దరూ అమెరికాలో వుంటున్నారు. అప్పుడప్పుడు అక్కడికి వెళ్లి రావడం తప్పితే శాశ్వతంగా అక్కడ వుండలేకపోయింది. పదేళ్ల క్రితం భర్త చనిపోయాడు.

తరచుగా వాళ్లింటికి వెళుతుండేవాడిని. ఆమె శరీరాన్ని ఎప్పుడూ తాకలేదు. ఆమెను దగ్గరకు తీసుకోవాలనే భావన కూడా వొచ్చేది కాదు. శారీరక సంబంధం లేని ప్రేమ గొప్పది.

గంటలకొద్దీ ఒకే గదిలో కూర్చుని మాట్లాడుకునేవాళ్లం. రాత్రి తొమ్మిదిదాటినా వసుమతి ఇంట్లోనే కాలక్షేపం చేసి ఇంటికి తిరిగొచ్చేవాడిని.

''నేను నీ భార్యను అయినట్లయితే మొహం మొత్తిపోయేదేమో! ఇలా గంటలకొద్దీ ఎదురుగా కూర్చునేవాడివేనా?'' నవ్వుతూ అడిగేది.

''నిన్ను పెళ్లి చేసుకోలేకపోయాననే విచారం నాకేమీ లేదు. లైఫ్ ఈజ్ టూ షార్ట్ ఫర్ రిగ్రెట్స్'' అనేవాడిని.

మాటలు దొర్లనప్పుడు ఒకరినొకరు మౌనంగా చూస్తూ కాలం గడిపేవాళ్లు.

మేమిద్దరం గదిలో కూర్చుని మాట్లాడుకుంటుంటే కరెంటుపోయింది.

''కొవ్వొత్తి లేదా?''

''నేను వెతికి కొవ్వొత్తి వెలిగిస్తా గాని నువ్వు కదలకుండా కూర్చో! నీ కాలో, చేతులో తగిలి తూలి నీ మీద పడతాను.'' అందామె.

''మీద పడితే ఏమవుతుంది?''

''వాకిలి తెరిచి వుంటే ఎవరూ కనిపించకపోతే సన్యాసికయినా ఇంట్లో దూరబుద్ధి అవుతుందట... నీ మీద పడితే నీకేం కాదు గానీ, నాకు మాత్రం మళ్లీ నీతో స్వేచ్ఛగా, హాయిగా మాట్లాడాలనిపించదు. తెల్లటి బట్టపై మురికినీళ్లు చల్లినట్లుంటుంది.

ఆమె చెప్పింది నిజమే!

ఒకే ఒక్కసారి వసుమతి తన ఒడిలో వాలిపోయింది. అదే చివరిసారి... కరెంటు, టెలిఫోన్ బిల్స్ ఈ-సేవ సెంటర్లు కట్టి రశీదు ఇవ్వడానికి వసుమతి ఇంటికి వెళ్లాడు తను.

స్నానం చేసి హాల్లోకి వచ్చింది.

కళ్లు తిరిగి తూలి పడిపోయింది. పరుగున దగ్గరకు వెళ్లి ఆమెను పొదివి పట్టుకున్నాను.

''ఏమైంది?''

''ఛాతిలో నొప్పి'' మెల్లగా అనగలిగింది.

నిమిషాల్లో ఆమె వొళ్లంతా చల్లబడిపోయింది.

తుదిశ్వాస తన ఒడిలోనే వొదిలింది.

అమెరికాలో వున్న ఆమె కొడుకులకు ఫోన్ చేశాడు తను. ఆమె చనిపోయాక నాలుగో రోజు దహనకాండ జరిగింది.

''మీ అమ్మగారి అస్థికలు గంగానదిలో కలపాలి బాబూ! కాశీ వెళ్లి రండి.''

వసుమతి పెద్ద కొడుకు తల అడ్డంగా వూపాడు.

''నాకు టైం లేదు అంకుల్. వెంటనే అమెరికా తిరిగి వెళ్లాలి''అన్నాడతను.

రెండోవాడూ అదేమాట.

''మా అమ్మగారికి ఆత్మబంధువు మీరే! మాకెటూ తీరిక లేదు. మీరే ఆ కార్యక్రమం పూర్తిచేయండి దయచేసి''అన్నాడు రెండోవాడు.

వాళ్ల పరిస్థితి అర్థం చేసుకున్నాడు. తన మీద గౌరవం వుంచడం తనకే ఆ పని అప్పగించడంతో, కాశీ ప్రయాణం తప్పలేదు.

★★★

కార్తీక్ తండ్రి అస్థికలు, తను వసుమతి అస్థికలు గంగా ప్రవాహంలో కలిపారు.

కాశీ విశ్వనాథుని దర్శనం అయ్యింది.

సాయంత్రం పూట గంగానదీ తీరంలో కూర్చున్నారు కేదార్‌ఘాట్ దగ్గర.

''స్నానం చెయ్యాలని వుందయ్యా'' కార్తీక్‌తో అన్నాను.

''ఉదయం నదీస్నానం చేశారుగా''.

''మళ్లీ చేయాలని వుంది.''

''నదీ ప్రవాహం ఉరకలు వేస్తోంది. జాగ్రత్తగా మెట్లు దిగండి. నేను పక్కనే నిలబడతాను'' అన్నాడు కార్తీక్.

మరో మెట్టు కిందకు దిగాను.

నీటి ప్రవాహం నడుం దాకా వచ్చింది.

''ముందుకు వెళ్లకండి. ప్రమాదం. ఇక్కడే మూడు మునకలు వేసి గట్టుమీదకు వచ్చెయ్యండి.''

కార్తీక్ మాటలు వినిపిస్తున్నాయి.

ఎనభై యేళ్ల వయస్సులో ప్రమాదమేమిటి? గంగా ప్రవాహంలో కొట్టుకుపోవడం కంటే అదృష్టం ఏముంది?

అతని చేయి విదిలించుకొని నీళ్లలో మునిగాను.

తల్లి గర్భంలో మొదలైన జీవన ప్రయాణం ముగియబోతున్నది. వసుమతి వెంటే నడిచాను. ఇప్పుడు వసుమతి నీడ తనతో పాటే వొస్తున్నది. తనకు కూడా ముక్తి లభించబోతున్నది.

మరో జన్మంటూ వుండదు. అందమైన బాల్యం, మనోహరంగా కనిపించే ప్రకృతి, సూర్యోదయాలు, సూర్యాస్తమయాలూ...పిట్టల అరుపులు వినిపించవా? లేగదూడ గంతులు, పసిపిల్లల నవ్వులు ఇవేవీ వుండవా? వసుమతి లాంటి అందమైన అమ్మాయితో పరిచయం వుండదా? జన్మరాహిత్యం వొద్దు. మరో జన్మలో కూడా వసుమతి సాన్నిహిత్యం వుండాలి. నీళ్లల్లో కొట్టుకుపోతున్న తనను ఎవరో ఈదుకొంటూ వొచ్చి భుజం పట్టుకొని ఒడ్డుకు చేర్చారు. కొంచెం కుదుటపడ్డాక కళ్లు తెరిచి చూస్తే ఎదురుగా కార్తీక్ కనపడ్డాడు.

''జీవితం ఉలిపిరి కాగితంలా పలుచటిది. ఎప్పుడో ఒకప్పుడు చిరిగిపోతుంది. మనమే గట్టిగాపట్టుకొని లాగి చింపి వేయడం ఎందుకు? మనం కోరుకున్నా కాశీలో చనిపోలేం. ఎక్కడ రాసిపెట్టి వుంటే అక్కడ''

కార్తీక్ చెప్పుకుపోతున్నాడు. చుట్టూ మూగిన అక్కడి హిందీ మాట్లాడేవాళ్లకు అతని మాటలు అర్థంకాలేదు.

